నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
గురువారం | ఫిబ్రవరి 22, 2024 | www.navatelangana.com

విద్యార్థినులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని గిమ్మ సెకండరీ పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పోకిరీలు అసభ్యంగా ప్రవర్తిస్తే, అఘాయిత్యాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్ దుష్పరిణామాలను వివరించారు. మత్తు ప్రాణానికి ముప్పు అని తెలిసి కూడా బానిసైన వారు వదలకుండా కుటుంబాలను కోల్పోతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరు సక్రమమైన దారిలో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మజ, షీ టీం సభ్యులు సుశీల, సత్యమోహన్ పాల్గొన్నారు.



లెనిన్ గొప్ప మానవతావాది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లెనిన్ గొప్ప మానవతావాది, సిద్ధాంతవేత్త, కార్యదక్షుడని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్.మంజుల అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రెడ్ బుక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ ఓ విప్లవాయుధం పుస్తకాన్ని సామూహికంగా చదివారు. ఆయన ప్రపంచానికి చేసిన సేవల గురించి వివరించారు. లెనిన్ ప్రపంచానికే గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్. స్వామి, కె. ఆశన్న, పొచ్చక్క ఆరిఫా, ప్రశాంత్ పాల్గొన్నారు.



నామినేటెడ్ జాతర..!

- ప్రారంభమైన మార్కెట్ పదవుల పంపకం
- ఉమ్మడి జిల్లాలో కమిటీలకు ఖరారైన రిజర్వేషన్లు
- ఇన్‌ఛార్జి మంత్రి, ఎమ్మెల్యేల వద్దకు ఆశావహులు
- తమ పేర్లను పరిగణనలోకి తీసుకోవాలని విన్నపాలు
- పదవి ఎవరిని వరిస్తుందోనని పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ

ఉమ్మడి జిల్లాలో నామినేటెడ్ పదవుల పంపకం ప్రారంభమైంది. నియోజకవర్గాల స్థాయిలో కీలకమైనవిగా భావించే మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లను ఖరారు చేసింది. వెంటనే తొలుత బోథ్ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. దీంతో మిగితా కమిటీల నియామకాలపై అందరి దృష్టి కేంద్రీకృతమవుతోంది. ఈ పదవులను దక్కించుకునేందుకు ఆయా ప్రాంతాల వారీగా ఇన్‌ఛార్జి మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల వద్దకు ఆశావహులు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల్లో పార్టీలో కీలక వ్యక్తులుగా ఉన్న పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు ఈ పదవులను తమకు కేటాయించాలని అభ్యర్థించినట్లు తెలుస్తోంది. పదేండ్లుగా ప్రతిపక్షంలో ఉండి పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడిన నాయకులు ఈ పదవులకు తమ పేర్లను పరిగణనలోకి తీసుకోవాలని కోరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉమ్మడి జిల్లాలో మరికొందరు కీలక నాయకులు రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ పదవులపై కన్నేసినట్లు తెలుస్తోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోవడం.. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరడంతో రాష్ట్రంలోని నామినేటెడ్ పదవులను రద్దు చేసింది. దీంతో రాష్ట్రంలో సుమారు 90వరకు కార్పొరేషన్ల పాలకవర్గాలు రద్దు కాగా.. జిల్లా స్థాయిలో మార్కెట్ కమిటీల పాలకవర్గాలను కూడా రద్దు చేసింది. అప్పటి ప్రభుత్వం నియమించిన పాలకవర్గాలు రద్దు కావడంతో వీటి స్థానంలో నూతనంగా నియమించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా మార్కెట్ కమిటీల పదవులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆయా మార్కెట్‌ల వారీగా రిజర్వేషన్లను ఖరారు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 17 మార్కెట్ కమిటీలు ఉండగా ఒక్కో కమిటీలో 18మంది సభ్యులను నియమించేందుకు ఆస్కారం ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతంలో పీసా చట్టం అమల్లో ఉండటంతో జైనూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ కమిటీలను ఎస్టీలకు కేటాయించగా.. మిగితా వాటిలో రోస్టర్ ప్రతిపాధికన రిజర్వేషన్లను ఖరారు చేసింది. కాగజ్‌నగర్, లక్షెట్టిపేట, జన్నారం, ఖానాపూర్, కుభీర్ (ఎస్సీ)లకు, బెల్లంపల్లి(ఎస్సీ-మహిళ) కేటాయించారు. ఆదిలాబాద్, జైనథ్, భైంసా, నిర్మల్ మార్కెట్ కమిటీలు (జనరల్)కు, మంచిర్యాల (జనరల్-మహిళ)కు కేటాయించారు. బోథ్, సారంగపూర్ కమిటీలు (బీసీ)లకు, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీని (బీసీ-బి.మహిళ)కు ప్రభుత్వం కేటాయించింది. వీటిలో ఒకరు ఛైర్మెన్ కాగా.. మిగితా 17మంది సభ్యులుగా ఉండనున్నారు. ఇందులో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు అందరికీ ప్రాతినిధ్యం కల్పించనున్నారు. ఇప్పటికే బోథ్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మిగితా 16 చోట్ల వీటిని ఖరారు చేసేందుకు ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది.

మార్కెట్ పదవులపై ఆశలు..!

నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేల తర్వాత మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పదవులకు ప్రాధాన్యం ఉంటుంది. ఈ పదవిలో ఉండే నాయకులకు రైతులు, ప్రజల్లోనూ మంచి ఆదరణ ఉంటుంది. దీంతో వీటిని దక్కించుకునేందుకు అనేక మంది విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్‌ఛార్జి మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆశావహుల పేర్లను ప్రభుత్వానికి సిఫార్సు చేస్తే ప్రభుత్వం వాటికి ఆమోదముద్ర వేసి పాలకవర్గాలను నియమించనుంది. దీంతో ఆయా మార్కెట్ కమిటీల పరిధిలో ఉండే నాయకులు వీటిని దక్కించుకునేందుకు అనేక ఏండ్ల నుంచి ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం పాత వాటిని రద్దు చేయగా.. అనేక మంది ఆశావహులు ఇన్‌ఛార్జి మంత్రి, ఎమ్మెల్యేల వద్దకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు సైతం పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఈ పదవులను కట్టబెట్టాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల స్థాయిలో అనేక మంది ద్వితీయ శ్రేణి నాయకులు పదేండ్ల పాటు ప్రతిపక్షంలో ఉంటూ అప్పటి ప్రభుత్వంపై పోరాడుతూ పార్టీలో గుర్తింపు సాధించారు. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వారంతా నామినేటెడ్ పోస్టులపై నమ్మకం పెట్టుకుంటున్నారు. కొందరు కీలక నాయకులు రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ పదవులను దక్కించుకోవాలని ఆరాట పడుతుండగా.. మరికొందరు జిల్లా స్థాయిలో మార్కెట్ కమిటీలు, గ్రంథాలయ ఛైర్మెన్, ఐటీడీఏ పాలకమండలి ఛైర్మెన్ తదితర వాటిపై దృష్టిసారించారు. ఎమ్మెల్యేలతో పాటు ప్రభుత్వ పెద్దలు, కీలకమైన ముఖ్య నాయకులను ప్రసన్నం చేసుకుంటూ ఆయా పదవులు తమకు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతో ఎవరికి పదవి వరిస్తుందో..ఎవరికి నిరాశ ఎదురవుతుందోనని ఆ పార్టీకి చెందిన ఆశావహులు, శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే హరీష్‌బాబు

- అభివృద్ధి పనులపై చర్చించేందుకేనని వెల్లడి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కలిశారు. ఈ కలయిక రాజకీయవర్గాలలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. హరీష్‌బాబు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరుతారా అనే ఊహాగానాలు వ్యాపించాయి. కాని దీనిని పాల్వాయి హరీష్‌బాబు కొట్టిపడేశారు. సీఎంను కలిసిన విషయమై హరీష్‌బాబును వివరణ కోరగా నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఒక ఎమ్మెల్యేగా సీఎం వద్దకు వెళ్లి సమస్యల గురించి మాట్లాడితే పార్టీ మారుతాడని ప్రచారం చేయడం సరికాదని అన్నారు. తాను ప్రస్తావించిన సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు హరీష్‌బాబు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదు



నవతెలంగాణ-సిరికొండ

కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదింటి ఆడపడుచుల కోసం కళ్యాణలక్ష్మి పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టారన్నారు. లేనిపోని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పారని, రైతుల కోసం ఏకకాలంలో రుణ మాఫీ చేస్తామని రైతులను మోసం చేసిందని అన్నారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా మంజూరైన సిసి రోడ్లకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. మండలంలో నెలకొన్న పలు సమస్యలను స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ విజయ్‌కుమార్, ఎంపిడిఓ బాలగంగాధర్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఎంపీటీసీలు పర్వీన్, సూర్యకాంత్, నాయకులు పెంటన్న, చందు, ఇక్బాల్, మల్లేష్, సూర్యకాంత్, లతీఫ్, లక్ష్మణ్, రంజాన్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృభాష ప్రాధాన్యతపై విద్యార్థులు గేయాలు ఆలపించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డి లక్ష్మినరసింహం మాట్లాడుతూ భావ ప్రకటనలో మాతృభాష ఎంతో శక్తివంతమైన సాధనమని అన్నారు. హిందీ అధ్యాపకుడు డి జనార్దన్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలలో మాతృభాషలోనే విద్యాబోధన జరుగుతుందని అన్నారు. కాబట్టి మాతృభాషను విస్మరించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ రాజు, అధ్యాపకులు శారద, దత్తాత్రేయ, మహేష్, సంతోష్, ప్రేంకుమార్, కోటేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన డి.స్వాతిని మీ సేవా నిర్వాహకులు గోపు రాంప్రసాద్, గంజాల లింగయ్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకురావడంతో సానుకూలంగా స్పందించారు. స్వాతి ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

సింగరేణిలో ఉద్యోగ నియామక

నోటిఫికేషన్లు సిద్ధం చేయాలి

- ఈ ఏడాదిలో వెయ్యి కారుణ్య నియామకాలు చేపట్టాలి
- థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు కొరత ఉండొద్దు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షించారు. సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్‌తో పాటు ఇతర అధికారులతో బుధవారం సింగరేణిలో ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న 317 నేరుగా చేపట్టాల్సిన నియామకాలతో పాటు అంతర్గతంగా సర్దుబాటు చేయాల్సిన 168 పోస్టులకు తక్షణమే భర్తీ నోటిఫికేషన్లు తయారు చేయాలని సూచించారు. అదేవిధంగా సింగరేణిలో కారుణ్య నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈ ఏడాదిలో కనీసం వెయ్యి మంది వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని అన్నారు. సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించిన ఆయన ఉద్యోగ నియామకాలలో పారదర్శకంగా ఉండాలన్నారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. నోటిఫికేషన్ల ప్రక్రియ పకడ్బందీగా ఉండాలని సూచించారు. సింగరేణి కార్మికుల కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎలాంటి ప్రీమియం చెల్లించవల్సిన అవసరం లేకుండా చేసుకున్న రూ.కోటి ప్రమాద బీమా అవగాహన ఒప్పందం పురోగతి గురించి ఆరా తీశారు. ఇప్పటి వరకు కోలిండియాలోనూ ఇలాంటి ఒప్పందం లేదని, త్వరలో మిలిగిన బ్యాంకులతోనూ ఈ ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎండీ బలరామ్ నాయక్ వివరణ ఇచ్చారు.

సోలార్ ప్లాంట్ ఆవిష్కరణకు ఏర్పాట్లు చేయాలి

కొత్తగూడెం ఏరియాలో నిర్మించిన 10.5 మెగావాట్ల సోలార్ ప్లాంటు ఈ నెల 26న ఆవిష్కరించడానికి ఏర్పాట్లు చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టిన మిగతా సోలార్ ప్లాంట్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సింగరేణి ఉద్యోగులు, అధికారుల సౌకర్యార్థం హైదరాబాద్‌లో నిర్మించ తలపెట్టిన అతిథి గృహం భూమి పూజ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. గోదావరిఖని, మంచిర్యాల కార్మికులకు సురక్షిత మంచి నీరు అందించేందుకు వీలుగా చేపట్టిన ర్యాపిడ్ గ్యావిటీ ఫిల్టర్‌ను ప్రారంభించడానికి సిద్ధం చేయాలని, వేసవిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున బొగ్గు ఉత్పత్తి, రవాణాలపై రోజు వారీ సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న 317 డైరెక్టు, 168 ఇంటర్నల్ పోస్టులకు గురువారం నోటిఫికేషన్ జారీ చేస్తామని సంస్థ సీఎండీ బలరామ్‌నాయక్ వెల్లడించారు.

డీఈఓ అక్రమాలపై టీఎస్‌యూటీఎఫ్ నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా విద్యాధికారి అక్రమాలపై పోరాటానికి సిద్ధమవ్వాలని టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ. స్వామి, వి.అశోక్ పిలుపునిచ్చారు. అక్రమ నియామకాల పట్ల వైఖరిని ఖండిస్తూ బుధవారం విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ నియామకం కొరకు నోటిఫికేషన్ ద్వారా అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరించగా ఇద్దరు గణిత ఉపాధ్యాయులు మాత్రమే అప్లై చేసుకున్నారన్నారు. అందులో తేజాపూర్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఆర్.గోవర్ధన్‌ను నియమించారన్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతున్న సందర్భంలో నోటిఫికేషన్ నిబంధనలకు విరుద్ధంగా ప్రలోభాలకు లొంగి, అవినీతికి పాల్పడి అర్హత లేని మరొక ఉపాధ్యాయుడిని ఏఎస్ఓగా నియమిస్తూ రహస్య ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. అక్రమ నియామక బండారం బయటపడుతుందని గోవర్ధన్‌ను రిలీవ్ చేయనివ్వకుండా నాటకమాడుతున్నారన్నారు. రిలీవ్ చేయని ప్రధానోపాధ్యాయునిపై ఎటువంటి చర్య తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారని పేర్కొన్నారు. గోవర్ధన్‌ను రిలీవ్ చేయించి వెంటనే ఏఎస్ఓగా విధుల్లో చేర్చుకోవాలని, లేని పక్షంలో డీఈఓ కార్యాలయం ఎదుట పోరాటం చేస్తామని నోటీసు ఇచ్చామని తెలిపారు. నోటీసు ఇచ్చిన సంఘాన్ని కాకుండా ఇతర సంఘాలను చర్చలకు పిలిచి సంఘాల మధ్య అంతరాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తమ సంఘాన్ని చర్చలకు ఎందుకు పిలువ లేదని నిలదీయగా డీఈవో బుకాయించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇదే కార్యాలయంలో నెల రోజుల క్రితం సెక్టోరియల్ ఆఫీసర్‌ను డిప్యూటేషన్‌పై నియమించే సందర్భంలో ఆయన పనిచేస్తున్న పాఠశాలకు వేరే పాఠశాల నుండి ఉపాధ్యాయుని సర్దుబాటు చేయించి రిలీవ్ చేయించుకుని పని చేయించుకుంటున్నారన్నారు. ఇదే పద్ధతిని ఏఎస్ఓ నియామకంలో ఎందుకు పాటించడం లేదని ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు చెబుతూ దాటవేత ధోరణిని అవలంభిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల బాలికల పట్ల దురుసుగా ప్రవర్తించిన నేరడిగొండ పాఠశాల ఉపాధ్యాయునిపై కేసు నమోదై సస్పెండ్ చేయగా ఎంక్వయిరీ పూర్తి కాకుండా ప్రలోభాలకు లొంగి అవినీతికి పాల్పడి తిరిగి అతన్ని అదే పాఠశాలలో రిపోర్టింగ్ ఆర్డర్ ఇచ్చారన్నారు. నిజనిర్ధారణ అనంతరం దూరంగా వేరే పాఠశాలకు కేటాయించాల్సింది పోయి నిబంధనలకు పాతర వేశారన్నారు. ఇలా డీఈఓ అక్రమాలకు అంతు లేకుండా పోయిందని మండిపడ్డారు. డీఈఓ తన వైఖరిని మార్చుకుని అక్రమాలను వెంటనే సవరించుకోవాలని, లేనిపక్షంలో తమ సంఘం పోరాటం చేస్తుందని, పైఅధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

మంత్రి సీతక్కపై తప్పుడు ప్రచారం చేస్తే సహించం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

పంచాయతీరాజ్, శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు ప్రజలలో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ కుట్రతో చేసిన ఆరోపణలను ఉపసంహరించకపోతే తీవ్ర పరిణామాలు ఎదురుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేస్తున్న మంత్రి సీతక్కను రాజకీయంగా తొక్కాలనే ప్రయత్నం చేస్తే సహించేది లేదన్నారు. గతంలో కేటీఆర్ ప్రోత్సహించిన ఇసుక దందాను బ్యాన్ చేసిన మంత్రి సీతక్కపై కక్షతో ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ ఆరోపణలకు సూత్రధారి, బీఆర్ఎస్ కరపత్రమైన నమస్తే తెలంగాణ పేపర్‌ను పాతాళంలోకి తొక్కేస్తామన్నారు. మంత్రిపై తప్పుడు ప్రచారాన్ని మానుకోకపోతే పరువునష్టం దావా కేసు వేస్తామన్నారు.

పలు గ్రామాల్లో వైద్య శిబిరం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని గుండాల గ్రామపంచాయితీ పరిధిలోని ఎస్సిగూడ, తాడిహత్నూర్ సబ్ సెంటర్‌లో వైద్య సిబ్బంది బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు టీకాలు ఇచ్చారు. అనంతరం ముప్పై ఏండ్లు పైబడిన వారికి పరీక్షలు నిర్వహించారు. జ్వరం, జలుబు ఉన్న 13 మందిని గుర్తించి ఉచిత మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పి హిమబిందు, హెల్త్ సూపర్వైజర్ చరణ్‌దాస్, ఏఎన్ఎం ఈశ్వరి, సింధు, సుశీల, విధ్యారాణి, ఆశాలు జ్యోతి, సంగీత, అనిత పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | ఫిబ్రవరి 22, 2024 | www.navatelangana.com

డీఆర్డీఓను కలిసిన జిల్లా కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిగా నూతనంగా నియమితులైన సాయన్నను కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు డిఆర్డిఓ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వారి వెంట నాయకులు శ్యామ్, ఆడే శంకర్, మోహన్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-జైనథ్




గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని లేఖర్‌వాడ గ్రామంలో బుధవారం జాతీయ ఉపాధి హామీ కింద 4లక్షల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులకు జడ్పీటీసీ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చిత్త శుద్ధితో పని చేస్తుందని తెలిపారు. ప్రజల ఆశలు, ఆశయాలకనుగుణంగా మంచి ప్రజాపాలన సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, అల్లూరి భూమారెడ్డి, యాల్ల పోతారెడ్డి, మాజీ సర్పంచ్ ఉష్కం దౌలత్, తల్లెల దాసు, మార్సెట్టి హన్మాండ్లు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

సేవాలాల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం దివ్యానగర్‌లోని జగదాంబ ఆలయ ప్రాంగణంలో సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాలను అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, రామారావు పాటిల్, అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్‌లతో కలిసి కలెక్టర్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని అన్నారు. సేవాలాల్ 1739 ఫిబ్రవరి 15న అనంతపూర్ జిల్లా రాంజీనాయక్ తండాలో జన్మించారని, ఈ సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జయంతి వేడుకలను ప్రతి సంవత్సరం ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, ఫిబ్రవరి 15న సెలవు ప్రకటించిందని తెలిపారు. సామాజిక దురాచారాలను నిరూలించడంతో పాటు ప్రజల మేలు కోసం సేవాలాల్ ఎన్నో ఉద్యమాలు చేశారని వివరించారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సేవాలాల్ మహనీయుడని, అయన ఆశయాల సాధనకు, బంజారాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మారుమూల గిరిజనతండాల రహదారులకు 100 కోట్ల నిధులతో నిర్మాణ పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఇండ్లు లేని పేద కుటుంబాలకు ఇండ్ల నిర్మాణంతో పాటు జిల్లా కేంద్రంలో ఆడిటోరియం, బంజారా భవన్ అలాగే గురుకుల పాఠశాలల భవన నిర్మాణాలకు కృషి చేస్తానన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ బంజారాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని సూచించారు. పోడు భూముల పట్టాలు, ఆర్ఓఎఫ్ఆర్ వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జగదాంబ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంతో పాటు అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావ్‌పటేల్ మాట్లాడుతూ ప్రజలందరూ సన్మార్గంలో నడవాలని కోరారు.



అంతకుముందు బంజారాల సంస్కృతీ సాంప్రదాయాలతో మహిళలు, చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు అధికారులు, ప్రజాప్రతినిధులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నాకళ్యాణి, డిఆర్‌డిఓ విజయలక్ష్మి, డిటిడిఓ అంబాజీ, సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు తుకారాం, సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.







కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని శిక్షణ కేంద్రంలో సూర్యాపేట, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుండి వచ్చిన సివిల్ కానిస్టేబుల్ సెలెక్ట్ అభ్యర్థులకు బుధవారం శిక్షణ ప్రారంభించారు. అదనపు ఎస్పీ సి సమయ్ జాన్ రావు శిక్షణను ప్రారంభించారు. ట్రైనీ కానిస్టేబుళ్లకు అవుట్ డోర్, ఇండోర్ రంగాలలో 8 సబ్జెక్టులలో ఇండోర్ క్లాసులు నిర్వహిస్తూ అవుట్ డోర్‌లో స్క్వాడ్‌డిల్, పరేడ్, మాబ్ ఆపరేషన్, వెపన్ హ్యాండ్లింగ్, ఫైరింగ్, లాండ్ ఆర్డర్ కంట్రోల్ తదితర అంశాలలో శిక్షణ అందించనున్నట్లు అదనపు ఎస్పీ తెలియజేశారు. అదేవిధంగా పోలీసు శిక్షణలో భాగంగా సిఆర్పిసి, ఐపీసీ, లా అండ్ ఆర్డర్ కంట్రోల్, ఇన్వెస్టిగేషన్ తదితర అంశాలను 9నెలల పాటు శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ప్రవీణ్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు టి మురళి, నవీన్, కార్తీక్, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మాదిగల జోడోయాత్ర



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాదిగలకు ఎస్సీ వర్గీకరణలో 12శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పిడమర్తి రవి నాయకత్వంలో హైదరాబాద్ నుండి ప్రారంభమైన మాదిగల జోడోయాత్ర గురువారం జిల్లా కేంద్రం చేరుకుంటుందని మాదిగ జేఏసీ జిల్లా నాయకులు మల్యాల మనోజ్, నక్కా రాందాస్ తెలిపారు. బుధవారం అంబేద్కర్ భవనంలో మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రానికి చేరుకున్న యాత్ర కేఆర్కే కాలనీలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మాదిగలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వాక నర్సిములు, జిల్లా ప్రచార కార్యదర్శి తార రవికుమార్, నాయకులు అద్దంకి శ్రీనివాస్, కల్లెపెల్లి మల్లేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మిక సంఘం నూతన కార్యవర్గం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కుంటాల రాములు డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కాంతారావు, అధ్యక్షులుగా చిరంజీవి, కార్యదర్శిగా రాజలింగుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. డీలర్ల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు నాంపల్లి వేణుగోపాల్ మాట్లాడుతూ ముఖ్యంగా గోనె సంచులు కొత్తవి ఇవ్వాలని, నాణ్యత గల బియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా జైనథ్, బేల మండలంలో ఎంఎల్ఎస్‌పీ కాంటా చేయకుండా డీలర్లకు బియ్యం పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రతి 50 కిలోల బస్తా నుండి రెండు కిలోల వరకు తరుగు వస్తోందన్నారు. నాణ్యమైన బియ్యం సరఫరా చేయకపోవడంతో పాటు చినిగిపోయిన, రీసైక్లింగ్ అయిన గోనె సంచులనే ఇవ్వడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సివిల్ సప్లయ్ పంపిన ఖాళీ బస్తాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ భారత్ బ్రాండ్ సన్న బియ్యంతోపాటు కందిపప్పు మిగితా సరుకులను చౌక ధరల దుకాణం ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. అనంతరం సంబంధితశాఖ అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కిషన్‌కుమార్, వసంత్, హరీంద్ర, వెంకటేష్, భూమన్న, పోశెట్టి, వినోద్ చౌదరి, మోహన్‌రెడ్డి, రామన్న, జైనథ్, బేల మండలాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధి



నవతెలంగాణ-కుభీర్

మండలాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ అన్నారు. బుధవారం మండలంలో అన్ని గ్రామాలకు ఉపాధి హామీ నిధుల కింద కోటీ62లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి మండల అధ్యక్షురాలు తూము లక్ష్మీబాయితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేసి ప్రజలకు అందేలా చూస్తుందన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు వివిధ కారణాలతో గొడవలు చేసుకొని కేసుల వరకు వెళ్లారని. ఇలా గొడవలు చేసుకోకుండా ఉండాలని సూచించారు. అందరూ కలిసి మెలిసి ఉండి మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆనంద్‌రావు పటేల్, జావిద్‌ఖాన్, యువజన సభ్యులు విలాస్ పాల్గొన్నారు.

బీజేపీ సంకల్ప యాత్రను జయవంతం చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రం గురువారం జరిగే బీజేపీ సంకల్ప బస్సు యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, బీజేపీ కౌన్సిల్ మెంబర్ రమేష్ రాథోడ్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడోసారి నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి కావాలనే ఉద్దేశంతో అస్సాం ముఖ్యమంత్రి సుమారు ఐదు వేల పైచిలుకు కిలో మీటర్ల సంకల్ప యాత్రను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు అరెల్లి రాజలింగం, కేంద్రే బాలాజీ, భీంరావ్ పాల్గొన్నారు.

అధైర్యపడకండి అండగా ఉంటా

నవతెలంగాణ-కుభీర్

బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడకుండా ఉండాలని, తాను అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం మండలంలో కాశ్ర గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం లక్షల నిధులు విడుదల చేసి మందిరాలను నిర్మించిందన్నారు. రైతులకు రైతుబంధు కింద పెట్టుబడి సాయాన్ని సమయానికి అందించిందన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికి కాలువలకు నిధులు మంజూరు చేసి గ్రామాలను అభివృద్ధిపర్చామని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూము లక్ష్మీబాయి, జడ్పీటీసీ ఆల్కతాయి సంజయ్, సహకార సంఘం చైర్మన్ గంగాచరణ్, వైస్ ఎంపీపీ మోహినుద్దీన్, మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, కో అప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిలా అనిల్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి తూము రాజేశ్వర్ పాల్గొన్నారు.



ముథోల్ : బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డ్ సభ్యుడు, బీఆర్ఎస్ కార్యకర్త మక్బూల్ అహ్మద్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం గతంలో కల్పించారు. మంజూరైన చెక్కును బుధవారం మృతుని భార్యకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్, ఎంపిటిసి సరళ శ్రీనివాస్ గౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖాలిద్, మాజీ ఎంపీపీ ఎజాజుద్దీన్, మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, నాయకులు రాంరెడ్డి, షమీమ్, విశ్వంబర్, అశోక్ వాగ్మారే, సమీ, సంజీవ్, బషీర్, జావీద్, అబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

అశ్లీల వీడియోలు అప్‌లోడ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సామాజిక మాధ్యమాల్లో రెడ్డిల పేరిట నకిలీ అకౌంట్లు క్రియేట్ చేసి అశ్లీల వీడియోలు అప్లోడ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం డిఎస్పీ జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రెడ్డి కులస్తుల పేరును చెడగొట్టడానికి కొంతమంది ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు డిఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.



కాంగ్రెస్ నాయకులను కలిసిన సుగుణక్క

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ టికెట్ ఆశిస్తున్న ఆత్రం సుగుణక్క బుధవారం మావల మండల కేంద్రంలోని బోరంచు శ్రీకాంత్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డితో పాటు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి చరణ్ గౌడ్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డిని కలిసి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ టికెట్ ఆశిస్తున్న తనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా బరిలోకి నిలిచేందుకు సిద్ధంగా ఉన్న తనకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మద్దతుతో పాటు ప్రజల ఆదరణ ఎంతో అవసరమని తెలిపారు. వీరి వెంట మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, ధర్మపురి రాము ఉన్నారు.

సంకల్ప యాత్ర కాదు సర్వనాశన యాత్ర



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర కాదు సర్వనాశన యాత్ర అని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు, కార్మిక పోరాటాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు. సామాన్య ప్రజల మీద జీఎస్టీ విధించి కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇస్తోందన్నారు. దేశంలో నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తోందని విమర్శించారు. కులమతాలతో రెచ్చగొట్టి దేశాన్ని విచ్ఛిన్న చేసి రాజకీయం చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అభివృద్ధి చేయని కేంద్ర ప్రభుత్వం సంకల్ప యాత్ర పేరిట బండి సంజయ్ ఆదిలాబాద్‌కు ఏం ముఖం పెట్టుకొని వస్తున్నారని ప్రశ్నించారు. సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపించలేదు, ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టలేదు, ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైలు రైల్వేలైన్ చేపట్టలేదు, గిరిజన యూనివర్సిటీ ఆదిలాబాద్‌కు తీసుకురాలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు నళినిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, ఎస్. అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

సీఎం విదేశీ విద్యా పథకానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుత విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఆర్.రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజనీరింగ్ డిగ్రీలో 60 శాతం మార్కులు ఉండి పీజీ చేయదలచిన వారు పీజీలో 60 శాతం ఉండి పీహెచ్‌డీ చేయాలనుకునేవారు. ఈ పథకానికి అర్హులని, ఈ పథకం ద్వారా లబ్ధి పొందగలిగే అభ్యర్థులు ఫాల్ సీజన్ ఆగస్టు 2023 నుంచి డిసెంబర్ 2023 వరకు ఎంపిక చేయబడిన విదేశీ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్ పొంది ఉండాలని అర్హత ఆసక్తిగల మైనార్టీలు తెలంగాణఈపాస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మార్చి 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత దరఖాస్తు ప్రతులను ఏప్రిల్ 15వ తేదీలోగా జిల్లా కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

పది ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నవతెలంగాణ-వాంకిడి

పదవ తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆదిశగా ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. బుధవారం వాంకిడి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి 10వ తరగతి ప్రత్యేక తరగతులు, విద్యార్థుల హాజరు శాతం, సైకిల్ టెస్టుల నిర్వహణ అంశాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులకు రూపొందించిన ప్రత్యేక కార్యచరణ, ప్రత్యేక తరగతులకు సంబంధించి విద్యార్థుల హాజరును పరిశీలించి విద్యార్థులు ఎక్కువమంది ఎందుకు గైర్హాజరవుతున్నారని, గైర్హాజరు శాతం తగ్గించడానికి ఎలాంటి కార్యాచరణ రూపొందించుకున్నారని ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులకు గణితములో కొన్ని లెక్కలు ఇచ్చి విద్యార్థుల చేత చేయించారు. ఈ సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, ప్లానింగ్ కోఆర్డినేటర్ భరత్ పాల్గొన్నారు.

26న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోగలరని ఎస్సై రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎస్పీ కె.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుద్యోగ యువతి, యువకులకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 26న సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు నిర్వహించనున్న ఈ జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన సుమారు50 బహుళ జాతీయ కంపెనీలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో భర్తీ చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు వివరించారు. పదో తరగతి, ఇంటర్మీడియేట్, పాలిటెక్నిక్ ఏదైనా డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, ఫార్మసీ పూర్తిచేసిన వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు.

ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి పాటు పడాలి



నవతెలంగాణ-కౌటాల

ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడాలని రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో పీజీ ప్రధానోపాధ్యాయులు గావుడె హనుమంతు అన్నారు. వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముగింపు సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసి ముత్తంపేట్ గుండాయిపేట్ కౌటాల కాంప్లెక్స్ పాఠశాలల పరిధిలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి దీనిపై విద్యార్థులను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణ సింగ్, నానాజీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలను అమర్చిన యూత్ సభ్యులు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని ధరంపల్లి, బాలెగుడ గ్రామాల మధ్య ఉన్న వాగు సరిహద్దు ప్రాంతాలలో విద్యుత్ దీపాల గురించి అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ, విద్యుత్ దీపాలను అమర్చలేదు. రాత్రి సమయాలలో ఇబ్బందులు పడుతున్నారని శ్రీ శివరామ సాయి యూత్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా విద్యుత్ స్తంభాలకు దీపాలను అమర్చారు. యూత్ సభ్యులకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్, సలహాదారులు ఎద్దు ప్రకాశ్, గుర్లె విలాస్, మాలి సంఘం మండల అధ్యక్షుడు నికోడె బాపురావు, యూత్ సభ్యులు బాన్లె విజయ్, గ్రామస్థులు జలపతి, పోషన్న, శ్రీను, మధుకర్, తిరుపతి పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో ప్రభుత్వం నిర్ణయించిన నిల్వలే ఉండాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వం కేటాయించిన వరి ధాన్యాన్ని మాత్రమే రైస్ మిల్లులో నిల్వ ఉంచుకోవాలని తహసీల్దార్ టి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని వేంపల్లి గ్రామంలోని లక్ష్మీ నరసింహ రైస్ మిల్లును తనిఖీ చేయగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం 38,260 వరి ధాన్య బస్తాలు కేటాయించగా దానిలో కేవలం 2174 వరి దాని బస్తాలు మాత్రమే ఉన్నాయి. 36091 బస్తాలు తక్కువగా ఉన్నాయని, నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు రైస్ మిల్లులో ఉన్నాయెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్య, ఆర్ఐ ముబీన్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన రిటైర్డ్ ఉద్యోగులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన భుజంగరావును బుధవారం జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు సమస్యలను విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కర్ణగౌడ్, యూనిట్ అధ్యక్షుడు నాంపల్లి శంకర్, నాయకులు కోమటిపల్లి లింగయ్య, సిడం సూరు, రామారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహీయా(తారిక్), నాయకులు రమణారెడ్డి, కోట వెంకన్న వేణుగోపాల్, శంకర్ పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

● ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రానున్న పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్‌డీఓ లోకేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లాలోని పీటీజీ బాలుర గురుకులంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని, స్ట్రాంగ్ రూమ్ కొరకు అనువైన గదులను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి స్థానికంగా ఉన్నందున వాహనాల పార్కింగ్, విధులు కేటాయించబడిన ఎన్నికల సిబ్బందికి సామాగ్రి పంపిణీ కేంద్రం, భోజన వసతి తదితర అంశాలపై సంబంధిత అధికారులు కార్యచరణ రూపొందించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు కేటాయించబడిన అధికారులు ఎన్నికలను విజయవంతం చేసే దిశగా సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వి. రమేష్ అన్నారు. మార్చి 9వ తేదీన జరగనున్న జాతీయ లో అదాలత్ కార్యక్రమంపై బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన భవన సముదాయంలో జిల్లా సీనియర్, జూనియర్ న్యాయమూర్తులు కె. యువరాజు, జె. అనంతలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. సతీష్ బాబుతో కలిసి బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మార్చి 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీ మార్గం ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని తెలిపారు. న్యాయవాదులు, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసే కక్షిదారులకు అవగాహన కల్పించాలని, జిల్లాలో 61 సైబర్ క్రైమ్ కేసులు నమోదయినట్లుగా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నుండి జాబితా పంపించడం జరిగిందని, ఈ కేసులను గుర్తించి ప్రీ లిటిగేషన్ కేసుల కింద పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సిర్పూర్ పరిధిలో కొనసాగుతున్న పాత కేసులను త్వరగా పరిష్కరించడంతో పాటు ఎన్‌బిడబ్ల్యు కేసులపై దృష్టి సారించాలని తెలిపారు. కన్జ్యూమర్ కేసులతోపాటు రాజీకి అవకాశం ఉన్న అన్ని సివిల్, క్రిమినల్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించేలా చూడాలని తెలిపారు. గత లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో కేసులను రాజీ చేయడం జరిగిందని, అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు కక్షిదారులకు సమయం, డబ్బులు ఆదా అవుతాయని వివరించాలని తెలిపారు. ఈ సమావేశంలో లీగల్ ఎయిడ్ డేటన్స్ కౌన్సిల్ ప్రతినిధులు, కాగజ్‌నగర్ డిఎస్‌పి, ఆసిఫాబాద్ డివిజన్ సిఐలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వంద రోజులు పని కల్పించాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-వాంకిడి



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మండలంలోని గోయగాం గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ భూములలో ఉపాధి హామీ కూలీలతో చేపట్టిన చిన్న నీటి కుంట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాబ్ కార్డు అర్హత కలిగిన ఉపాధి హామీ కూలీలకు 100 రోజుల పని కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా రైతులకు ఉపయోగం కలిగే ప్రయోజకరమైన పనులను మాత్రమే చేపట్టాలన్నారు. వేసవికాలం సమీపిస్తున్నందున పని ప్రదేశాలలో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో పర్యటించి మంచినీటి సరఫరా ప్రక్రియపై తనిఖీ చేపట్టారు. మంచినీటి బోరు బావులను పరిశీలించి వేసవికాలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, ఉపాధి హామీ చట్టం ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగితే విజయం సాధ్యం

● డీఐఈఓ నైతం శంకర్

నవతెలంగాణ-రెబ్బెన

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగితే విజయం సాధ్యమవుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ అన్నారు. మండలంలోని ఇంద్రానగర్ వద్ద గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన క్రీడా ఫేర్వెల్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో లక్ష్యం ఉన్నతంగా ఎంచుకోవాలన్నారు. అప్పుడే విజయం సాధ్యమవుతుందని తెలిపారు. చరిత్రలో ఎంతోమంది గొప్పవారు పేదరికం నుండే వచ్చారని ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ఇతర కళాశాలలతో పోలిస్తే రెబ్బెన కళాశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వివిధ రకాల క్రీడా పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. అధ్యాపక బృందం డీఐఈఓను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్, అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు



నవతెలంగాణ-కౌటాల

బీఆర్ఎస్ పార్టీ పెద్ద నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని కాంగ్రెస్ మండల స్థాయి నాయకుడు సిద్దల దేవయ్య అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ ఎంపీపీ బసర్కర్ విశ్వనాథ్, బీఎస్పీ నాయకుడు అర్షద్ హుసేన్ ఇద్దరూ ఎవరితో సంప్రదింపులు లేకుండా తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి పార్టీలో చేరేందుకు సంప్రదింపులు చేస్తున్నారని తెలిసిందన్నారు. గతంలో భూకబ్జాలు చేసి మా మీద కేసులు పెట్టినవారు మేము ఇప్పటికీ కేసుల పేరుతో కోర్టుల చుట్టూ తిరుగుతూ గతంలో భట్టి విక్రమార్కను కలిసి ఈ విషయం అంతా చెప్పినప్పుడు ఆయన మాకు మంచి రోజులు వస్తాయని అప్పటి వరకు వేచి ఉండాలని చెప్పినట్లు గుర్తు చేశారు. ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత భూకబ్జా దారులు వారి ఆస్తులు కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లో చేరుతున్నారే తప్ప పార్టీపై అభిమానం కాదని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాసన్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కానీ ఎవరిని సంప్రదించకుండా రాష్ట్ర పెద్దలను కలిసి పార్టీలో చేరుతామంటె మాకు సమాచారం లేకుండా వాళ్ళని చేర్చుకోవద్దని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కస్తూరి సత్యనారాయణ శ్రీనివాస్ సంతోష్ ఉన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

● జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కుమార్



నవతెలంగాణ-జైనూర్

విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కుమార్ అన్నారు. బుధవారం జైనూర్ సిర్పూర్ లింగాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఫేర్వెల్ పార్టీలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య పట్ల అన్ని విధాలుగా వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. విద్యతో సమాజంలో ఎన్నో మార్పులు జరుగుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి ఉపాధ్యాయులు ఉన్నారని, వారికి ఉన్న అనుభవాలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్తు గురించి ఆలోచించి మంచి విద్య అందించాలని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సమ్మక్క సారలమ్మ జాతర



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని తెల్లరాపుల గుట్ట సోమిని గ్రామ సమీపంలోని ప్రాణహిత నది ఒడ్డున మంగళవారం సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం అడవి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సమ్మక్క సారలమ్మలను గద్దెలకు తీసుకోవచ్చారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఈ జాతరకు మండలంలోని నలుమూలల నుంచి ఆదివాసీ గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సాంప్రదాయ ప్రకారం ఎడ్లబండ్ల ద్వారా సమ్మక్క సారక్క జాతరకు భక్తులు చేరుకున్నారు. ప్రాణహిత నది ఒడ్డున నిర్వహించిన జాతరకు బీజేపీ నాయకులు మనోహర్‌గౌడ్, సామల తిరుపతి, కుమ్మరి బాలకృష్ణ, పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్ఐ విక్రమ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. అటవీ ప్రాంతంలో నిర్వహించిన సమ్మక్క సారక్క జాతరకు అటవీశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నీటి సౌకర్యార్థం చేతి పంపు ఏర్పాటు

నవతెలంగాణ-రెబ్బెన

రెబ్బెన గ్రామపంచాయతీ పరిధిలోని పుంజుమేరగూడ గ్రామంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో నీటి సౌకర్యార్థం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ చేతి పంపు ఏర్పాటు చేసేందుకు బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలని దృఢ సంకల్పంతో పని చేస్తోందాని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడ్యా రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, సీనియర్ నేత, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్ గౌడ్, సీనియర్ నేత మోడెం చిరంజీవి గౌడ్, వడ్డె నాగేష్, మైనార్టీ మండల అధ్యక్షుడు ఇంరోజ్, గోగర్ల రాజేష్, అవిడపు గోపి, మోర్లే తులసిరాం, గ్రామస్థులు విసయ్య, వడ్డె గణపతి, వడ్డె కాంతారావు, రాంచందర్, మధు, గొండయ్యా, భీంరావు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీ శివ పంచాయతన సహిత శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పెండ్యాల గౌతం శర్మ, బ్రహ్మశ్రీ గట్టు సీతారాం శర్మ, బ్రహ్మశ్రీ ఇందారపు శంకర్ శర్మ, వేద పండితుల అధ్వర్యంలో హోమం నిర్వహించారు. వేద మంత్రోచ్చరణాలతో యంత్ర స్థాపన, విగ్రహప్రతిష్టాపన చేశారు. అనంతరం పూర్ణాహుతి , కుంభాభిషేకం, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముండే విమలాబాయి, ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్, పుర ప్రముఖులు గాదె అనిల్, గాదె అవినాష్, గాదె ప్రవీణ్, గాదె శివకుమార్ పాల్గొన్నారు

నేటితో ప్రవేశాల దరఖాస్తుల గడువు ముగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 6 నుండి 10 వ తరగతి లో ప్రవేశం కొరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి తుది గడువు గురువారంతో ముగుస్తుందని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేయడానికి సమీప మీ సేవా కేంద్రాల్లో లేదా అంతర్జాల కేంద్రంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని 108 వాహనాన్ని రాష్ట్ర కార్యాలయ క్వాలిటీ డిపార్ట్మెంట్ అధికారి కిషోర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని ప్రాథమిక వైద్య పరికరాలు, మెడికల్ కిట్లు, రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఘటన స్థలానికి త్వరగా చేరుకొని బాధితులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు.

పీఎం కిసాన్ ఈ కేవైసీ, ఆధార్ లింక్ నమోదు శిబిరం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని దేవునిగూడ రైతు వేదికలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో భాగంగా రైతులకు కవ్వాల్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి సయ్యద్ అక్రమ్ ఆధ్వర్యంలో బుధవారం ఈ కేవైసీ, ఆధార్ లింక్ నమోదు ప్రక్రియ నిర్వహించారు. పోస్టల్ బీపీఎం లక్ష్మి, కామన్ సర్వీస్ సెంటర్ క్లస్టర్ పరిధిలోని రైతులు ఈ కేవైసీ ఆధార్ లింకు ప్రక్రియను పూర్తి చేశారు. రైతులు తప్పకుండా ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

నవతెలంగాణ-మందమర్రి



గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. మందమర్రి అంగడి బజార్‌కు చెందిన బండి అనిల్ వృత్తిరీత్యా మేకల వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి తన పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో రాత్రి 2.30 మధ్య సమయంలో అతను ప్రయాణిస్తున్న హెచ్ఎఫ్ డీలక్స్ టీఎస్ 19 ఏ 6780 నెంబర్ గల ద్విచక్ర వాహనంను ఎర్రగుంటపల్లి క్రాస్ రోడ్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుని అన్నయ్య బండి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు మందమర్రి ఎస్ఐ ఎస్ రాజశేఖర్ తెలిపారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ మృతి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని తపాలాపూర్ గ్రామానికి చెందిన గోట్ల పవయ్య(40) అనే విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. పవయ్యా గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో మృతి చెందినట్లు మృతుని భార్య మల్లేశ్వరి తెలిపారు. మృతునికి 13 ఏండ్ల కూతుళ్లు వైష్ణవి, ఏడేండ్ల దీపిక, ఇద్దరు ఉన్నారు. పవయ్యా దండేపల్లి మండలంలోని సబ్ స్టేషన్‌లో సబ్ స్టేషన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

పదవీ విరమణ పొందనున్న అధికారికి సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

జనరల్ మేనేజర్ సర్వేగా పని చేసి పదవి విరమణ పొందుతున్న పీఎస్‌కే రవిని ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జీఎం సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థకు రవి చేసిన సేవలను కొనియాడారు. వారి శేష జీవితం ఆయురారోగ్య అష్టఐశ్వర్యాలతో తులతూగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రఘు కుమార్, శ్రీరాంపూర్ అధికార సంఘం అధ్యక్షులు కె వెంకటేశ్వర్ రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఐకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం శ్రీనివాస్, డీజీఎం(పి) పి అర్విండ్ రావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, రక్షణాధికారి శ్రీధర్ రావు, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, డీజీఎం ఏరియా స్టోర్స్ యాదయ్య, వృత్తి శిక్షణ కేంద్రం ఎస్ఓఎం కల్హారు వెంకట రామారావు, పర్చేజ్ ఎస్ఈ చంద్రశేఖర్, కె కిరణ్ కుమార్, చంద్రశేఖర్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

నవతెలంగాణ-తాండూర్

చిరు వ్యాపారులు చిల్లర కొట్టు యజమానులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం తాండూర్ పంచాయతీని సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, నర్సరీ, డంపింగ్ యార్డ్, జడ్పీ హైస్కూల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల జరిగే అనర్థాలను కిరాణా షాపు యజమానులకు తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు వాడినా.. షాపుల ముందు గ్లాసులు చెత్త వేసిన జరిమాన విధించాలని పంచాయితీ అధికారులకు సూచించారు. తాండూర్ డంపింగ్ యార్డ్ పరిశీలించిన పంచాయతీ అధికారి పంచాయతీ సెక్రెటరీపై మండిపడ్డారు. పంచాయతీలోని చెత్త సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. వర్మీ కంపోస్ట్ తయారీ జరగకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయితీలలోని వర్మీ కంపోస్ట్ షెడ్లలో వర్మీ కంపోస్ట్ తప్పకుండా తయారు చేయాలని సూచించారు. నర్సరీలో మొక్కలు షిఫ్టింగ్ గ్రేడింగ్ చేయాలని సూచించారు. రానున్న ఎండాకాలం కృష్ణ మొక్కల సంరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. నర్సరీలోని మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, డీపీఎం, ఎంపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

గంజాయి జోరు..రేస్ బైక్‌ల హోరు..!

- గ్రామాల్లో మత్తులో చిత్తవుతున్న యువత
- రేస్ బైక్‌ల ప్రమాదకర డ్రైవింగ్
- బెంబేలెత్తుతున్న గ్రామీణ జనాలు
- ఛిద్రమవుతున్న చిన్నారుల భవితవ్యం
- బయటకు చెప్పుకోలేని బాధిత కుటుంబాలు
- అడ్డుకోలేకపోతున్న పోలీసులు

ప్రశాంత వాతవరణంలో ఉండే గ్రామాలు ఇప్పుడు కలవరపడుతున్నాయి. యువత గంజాయి మత్తులో పడి చిత్తవడమే దీనికి కారణం. మండలంలో యువత ప్రస్తుతం గంజాయి సేవిస్తూ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్న తీరు తల్లిదండ్రుల్లో కలవరం రేపుతోంది. బైక్ రేస్‌లతో ప్రమాదకర డ్రైవింగ్ చేస్తూ బెంబెలేతిస్తున్నారు. సాయంత్రం వేళల్లో విద్యార్థినులు పాఠశాల, కాలేజీల నుండి ఇండ్లకు చేరే క్రమంలో ప్రధాన కూడళ్లలో బైక్‌లతో విన్యాసాలు చేస్తూ భయబ్రాంతులకు గురిచేస్తున్నారు. మత్తుకు అలవాటు పడ్డ పిల్లలను చూస్తూ తల్లిదండ్రులు బయటకు చెప్పుకోలేక వారి భవిష్యత్ ఏమవుతుందోనని లోలోపల ఆందోళన చెందుతున్నారు.

నవతెలంగాణ-హాజీపూర్

మండల కేంద్రానికి దగ్గర్లోని గ్రామాల్లో యువత కొద్ది రోజులుగా గంజాయి సేవిస్తున్నట్టు సమాచారం. కొన్ని గ్రామాలకు చెందిన యువకులు తమకున్న పరిచయాలతో గిరిజన ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సాగుచేస్తుండడంతో అక్కడి నుండి గంజాయి తీసుకువచ్చి ఇక్కడి యువకులకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. వంద గ్రాములు ఉండే గంజాయి ప్యాకెట్‌ను రూ.300 నుండి ఐదు వందల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. యువకులు ఈ ప్యాకెట్లను కొని సిగరెట్‌లలో నింపుకొని సేవిస్తున్నారు. అనంతరం మత్తు దిగే వరకు ఇళ్లలోకి వెళ్లకుండా గ్రామంలోనే తిరుగుతూ చిన్న చిన్న తగాదాలకు కూడా పాల్పడుతున్నట్లు వినికిడి. మండలంలోని గుడిపేట్, రాపల్లి, నర్సింగపూర్, పడతానపల్లి, కర్ణమామిడి, పెద్దంపేట్, ముల్కల్ల, హాజీపూర్ గ్రామాల్లో గంజాయికి యువత అలవాటు పడ్డట్లు తెలుస్తోంది. తమ పిల్లల భవిష్యత్‌ను కాపాడుకుందామని కొందరు తల్లిదండ్రులు అనుకుంటున్నప్పటికి బయటికి తెలిస్తే వారి భవిష్యత్ ఏమవుతుందోననే బెంగతో ఎవరికి చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతున్న ఘటనలు పల్లెల్లో చోటు చేసుకుంటున్నాయి. గత ఏడాది గుడిపేట్, ముల్కల్ల గ్రామాలకు చెందిన ఒకరిద్దరు గంజాయి మత్తుకు బానిసై ఇంట్లో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించిన సంఘటనలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా పోలీసులు గంజాయి సరఫరాను అడ్డుకొని దానికి బానిస అయిన యువకుల భవిష్యత్తును కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇది గోప్యంగా జరగాలని, యువకుల భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని వారిని గంజాయి బారి నుండి కాపాడాలని కోరుతున్నారు. ఇప్పటికే మండలంలో కొందరు యువకులు గంజాయికి బానిసై ఆత్మహత్యలకు పాల్పడినా సదరు కుటుంబ సభ్యులు ఈ విషయమై బయటకు చెప్పకుండా ఉన్న ఘటనలు ఉన్నాయి.

చలాన్లకే పోలీసులు పరిమితమా..?

గ్రామాల్లో గంజాయి, పేకాట, కోడి పందాలు జరుగుతున్నా స్థానిక పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. పోలీసులు చలాన్లు మాత్రమే వసూలు చేస్తూ మిగతా విషయాలు పట్టించుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. గంజాయి విస్తరణ, రేస్ బైక్‌ల కల్చర్ పెరగడంతో మండల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్లను నియమించినా సిబ్బంది సరిపోని కారణంగా విధులు కేటాయించడం లేదు. ప్రతి గ్రామానికి ఓ పోలీస్ అధికారిని నియమిస్తే ఈ కార్యక్రమాల అదుపు జరుగుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జంకుతున్న విద్యార్థినులు

విద్యార్థినులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చే సమయంలో పోకిరీల ఆగడాలు శృతి మించుతున్నాయి. రేస్ బైక్‌లపై మితిమీరిన వేగంతో ప్రమాదకర డ్రైవింగ్ చేస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రం నుండి కొందరు యువకులు స్థానిక యువకుల స్నేహంతో కేటీఎం లాంటి బైక్‌లతో ముగ్గురు ప్రయాణం చేస్తూ స్టంట్లు వేస్తున్నారు. బుధవారం గుడిపేట్ ఆర్అండ్ఆర్ కాలనీ స్టేజ్ వద్ద సాయంత్రం విద్యార్థినులు బుస్ దిగిన క్రమంలో ముగ్గురు యువకులు రేస్ బైక్‌పై వచ్చి బస్‌కు దగ్గరగా మితిమీరిన వేగంతో వెళ్లడంతో బస్ డ్రైవర్ బ్రేక్ వేశాడు. స్థానికులు బైక్‌పై ఉన్న ముగ్గురిని పట్టుకునే ప్రయత్నం చేసినా దొరకకుండా పారిపోయారు. వారు కాలనీకి వెళ్లి మితిమీరిన వేగంతో హల్‌చల్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మండలంలో గంజాయి, ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గుడిపేట్‌లో గంజాయి సేవించిన ఆనవాళ్లు



బస్సుకు అడ్డంగా రేస్ బైక్

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి సీఓఈలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల లాంగ్వేజ్ క్లబ్ ఆధ్వర్యంలో బహుభాషా కవిసమ్మేళనం పద్యపఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఐనాల సైదులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పుట్టుకతో తల్లి నుండి నేర్చుకునే భాష మాతృభాషగా ఉంటుందని దానిని ఎప్పటికీ మరువకూడదన్నారు. ప్రతి ఒక్కరూ సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలను పెద్దవారి నుంచి వారసత్వంగా పొందాలని అందుకు వృద్ధులను అడిగి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆకట్టుకున్న బహుభాషా కవిసమ్మేళనం గోండి, లంబాడి, ఉర్దు, హింది, మరాఠి, తెలుగు భాషల్లో విద్యార్థులు తాము వ్రాసిన కవితలను గానంచేసి ఆకట్టుకున్నారు. అదేవిధంగా తెలుగులో పలువురు విద్యార్థులు పద్యపఠనంచేసి తెలుగు భాషపై తమ ప్రేమను చాటుకున్నారు. విద్యార్థులు చురుకుగా పోటీపడి పద్యాలు, కవితలు చెప్పడం పట్ల ప్రిన్సిపాల్ ఆనందం వ్యక్తంచేసూ చిరుకానుకలు అందజేశారు. వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గోండి భాషలో పెందూరి ఉమేష్(8వ తరగతి), లంబాడీ భాషలో రాథోడ్ జగదీష్(6వ తరగతి), ఉర్దు భాషలో, మహ్మద్ షహజాద్(6వతరగతి), హిందీలో రాజులదేవి ఆదిత్య(7వతరగతి), మరాఠి భాషలో జి.అరవింద్(6వ తరగతి) తెలుగు భాషలో చుంచు సంజయ్, ఐనాల భగవత్(7వ తరగతి), కొండపల్లి కార్తీక్, కుర్సింగ ఆంజనేయ ప్రసాద్,కర్రె సనత్ కుమార్(6వ తరగతి), ఇస్లావత్ రిరుపతి(8వ తరగతి),రాంటెకి శివప్రసాద్, జాంబోజి యశ్వంత్(9వ తరగతి) విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో లాంగ్వేజ్ క్లబ్ అధ్యక్షులు సజ్జనపు విజయ్ కుమార్, జేవీపీ పొన్నం శ్రీనివాస్, ప్రేమలత, హారిక, కాసర్ల రాజేందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాలకపక్షం, ప్రతిక్షం ప్రతినిధులుగా విద్యార్థుల అభినయం అదుర్స్

- భీమారం జడ్పీ పాఠశాలలో పర్యావరణంపై జిల్లా పరిషత్ నమూనా సమావేశం



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ నమూన సమావేశం ఆసక్తిగా కొనసాగింది. పాలక పక్షం, ప్రతిపక్షం ప్రతినిదులుగా, ప్రభుత్వ అధికారులుగా విద్యార్థుల అభినయం అదుర్స్ అనిపించింది. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన సమ్మక్క సారలమ్మ జాతరకు కోట్లాదిగా తరలివచ్చే జనజాతరలో పర్యావరణాన్ని పరరిక్షించడం కోసం చేపట్టాల్సిన చర్యలపై పాఠశాల విద్యార్థులతో నమూనా జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, డీఎంహెచ్ఎంఓ, పాలక పక్షం, ప్రతిపక్షం ప్రతినిదులతో పాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రలను పోషించిన విద్యార్థులు శభాష్ అనిపించుకున్నారు. సమ్మక్క, సారలమ్మ జనజాతరలో పర్యావరణ కాలుష్యంతో ఏర్పడే పరిణామాలు, ప్లాస్టిక్ ఉపయోగం వల్ల కలిగే అనర్థాలను సమావేశం ద్వార వివరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. అదేవిధంగా జాతరలో అపరిచిత వ్యక్తుల పట్ల ఏవిధంగా ఉండాలన్న తీరును వివరిస్తూ సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్రమ్ కుమార్, వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ జాతర సమయంలో విద్యార్థుల తల్లితండ్రులకు సామాజిక పర్యావరణ స్పృహ కల్పించడం సమ్మక్క సారలమ్మ జాతర నిర్వాహణపై మాక్ జడ్పీ సమావేశం నిర్వహించారు. దీని ద్వార విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడంతో పాటు అవగాహన కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ శశికళ, గ్రామ కార్యదర్శులను హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఉపాధి హామీ సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య పనులు చేయించాలని నీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఏఏ గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడుతుందో ఆ గ్రామాలను గుర్తించి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో లేబర్‌ల సంఖ్య పెంచుతూ పనులను పూర్తి చేయించాలన్నారు. అన్ని రకాల రిజిస్టర్‌లను సరిగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ, రవీందర్, ఈసీ విలాస్ పాల్గొన్నారు.

మల్లన్న భక్తుల సౌకర్యార్థం చేతి పంపు ఏర్పాటు

నవతెలంగాణ-జైపూర్

వేలాల మల్లన్న జాతరకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారి విద్యాసాగర్ హ్యాండ్ బోరు ఏర్పాటు చేయించారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని లక్షలాదిగా తరలివచ్చే భక్తుల దహార్తి తీర్చడం కోసం ఎమ్మెల్యే ప్రతేక నిధులతో బోరు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించు జాతర సంధర్భంగా భక్తుల అవసరాల మేరకు వసతుల కల్పన, తాగు నీరు, లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుపై దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.


వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని మంచిర్యాల డీఎల్పీఓ ధర్మారాణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మురిమడుగు, ఇందన్‌పెల్లి గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపంచాయతీలలో ఉన్న రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో 100 శాతం ఇంటి పన్నును వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉన్న నర్సరీలను పరిశీలించి మొక్కలకు సక్రమంగా నీటిని అందించాలన్నారు. పారిశుధ్య కార్మికులు సమయపాలన పాటించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు.వారితో పాటు జన్నారం ఎంపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శులు జంగు, చంద్రమౌళి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఉపరితల గనిని సందర్శించిన డైరెక్టర్



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఉపరితల గనిని డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జి.వెంకటేశ్వర్ రెడ్డి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డితో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సీఆర్ఆర్ కంపెని వారి ఆప్ లోడింగ్ పని ప్రదేశాలను, జీవీఆర్ ఆప్ లోడింగ్ పని ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే సీఆర్ఆర్ కాంట్రాక్ట్ ప్రతినిధులతో మాట్లాడి నిర్దేశిత ఓబీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం శ్రీరాంపూర్ ఉపరితల గని సాధించవలసిన 35 లక్షల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతను సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. 162.45 హెక్టార్ల అటవీ భూమి బదలాయింపు చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపరితల గని ఇన్‌చార్జి ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, గని మేనేజర్ సుధీర్ జక్కుల్ వార్, క్వాలిటీ మేనేజర్ కె వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

కరెంట్ స్తంభాలను తొలగించండి

నవతెలంగాణ-జన్నారం



తన స్వంత భూమిలో వేసిన కరెంట్ స్థంబాలను తొలగించాలని మండలంలోని ఇందన్‌పెల్లి గ్రామానికి చెందిన లసెట్టి గంగవ్వ కోరారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇందన్‌పెల్లిలో సర్వె నెంబర్ 82లో తనకు ఉన్న ఒక ఎకరం 30 గుంటల భూమి నుండి విద్యుత్ ఆఫీసర్లు తనకు ఎలాంటి సమాచార మివ్వకుండా అవతలివైపుకు రెండు స్థంబాలను వేసి విద్యుత్ లైను వేశారని అన్నారు. తన పంట పొలం మధ్య నుండి విద్యుత్ లైన్ వేయడం వల్ల ఇబ్బందులుపడుతున్నామని ఈ విషయంపై స్థానిక ట్రాన్స్ కో ఏఈ కి తెలియజేసి స్థంబాలను తొలగించాలని కోరినప్పటికి పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైన తన సొంత భూమిలో వేసిన విద్యుత్ స్థంబాలను తొలగించాలని లేని యెడల కలెక్టర్ దృష్టికి తీసుకళ్తానని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | ఫిబ్రవరి 22, 2024 | www.navatelangana.com

సమ్మక్క-సారమ్మ గద్దెలను దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని కజర్ల గ్రామంలో గల సమ్మక్క సారలమ్మ గద్దెలను బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో గల సమ్మక్క సారలమ్మ జాతర మాదిరి కజ్జర్ల గ్రామంలో సమ్మక్క సారలమ్మ విగ్రహాలను నెలకొల్పడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోట వెంకటేష్, పిడుగు అభిరామిరెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్లా, వెంకట్‌రెడ్డి, రాంకిషన్, నాగారెడ్డి, రమాకాంత్, రంజిత్‌రెడ్డి, నర్సిములు, ప్రకాష్, సమ్మక్క సారమ్మ విగ్రహ ప్రతిష్టాపకులు అశోక్, వివిధ గ్రామాల నుండి వచ్చిన మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్కే-1ఏ గద్దెపై సారలమ్మ రాక

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



ఆర్కే-1ఏ గని పాలవాగు సమీపంలో గల సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా సారలమ్మ బుధవారం గద్దెపై కొలువుతీరారు. అమ్మవారికి గిరిజన పూజారులు పూజలు నిర్వహించి, డప్పు సప్పులతో మేళతాళాలతో నృత్యాలతో అమ్మవారిని గద్దెకు చేర్చారు. ఈ కార్యక్రమంలో మందమర్రి జీఎం మనోహర్, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫూలే దంపతుల విగ్రహాలు ధ్వంసం



నవతెలంగాణ-వేమనపల్లి

కోటపల్లి మండలంలోని బోరంపల్లి గ్రామంలో సావిత్రిబాయి - జ్యోతిరావుపూలే విగ్రహాలను బుధవారం రాత్రి దుండగుడు ధ్వంసం చేశారు. విగ్రహాలను ధ్వంసం చేస్తుండగా గ్రామస్తులు దుండగుడిని పట్టుకున్నారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. దుండగుడి దగ్గర గొడ్డలి ఉందని, అడ్డుకోవడానికి యత్నించగా దాడి చేయడానికి ప్రయత్నించాడని గ్రామస్తులు గోమాస సందీప్, గోమాస రాజ సమ్ములు పేర్కొన్నారు. ఈ ఘటనను మంచిర్యాల జిల్లా బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం ఖండించారు. దుండగుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సీసీ రోడ్డు పనులకు డీసీసీబీ డైరెక్టర్ భూమి పూజ



నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలకు సైతం నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో చాందా(టి) గ్రామంలో ఈజీఎస్ కింద ఎస్డిఎఫ్ నిధులు 3లక్షలతో చేపట్టి సీసీ రోడ్డు నిర్మాణం పనులకు ఆయన బుధవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకునే వారని గుర్తు చేశారు. జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క కోటాలో 11కోట్ల ఈజీఎస్ నిధులలో సగం నిధులు ఎమ్మెల్యేకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొచ్చీరాం, శ్రీధర్, శ్రీనివాస్, రవి, సుదర్శన్, సురేందర్, ముకీమ్ పాల్గొన్నారు.

షాదీఖానా స్థలాన్ని కాపాడాలని వినతి



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణం షంషీర్ నగర్‌లోని 2 ఎకరాల షాదీఖానా స్థలాన్ని కాపాడాలని బెల్లంపల్లి మైనార్టీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే వినోద్‌కు వినతి పత్రం సమర్పించారు. కొంతమంది భూబకాసురులు కలిసి పాత తేదీల్లో దొంగ రెవిన్యూ పత్రాలు సష్టించి కోర్టుకు తప్పుదారి పట్టించి స్థలాలు కబ్జా చేసి అమ్మకాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. షాదీఖానా స్థలం కూడా కబ్జా కాకుండా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, రాష్ట్ర మాజీ మైనారిటీ సెల్ కోఆర్డినేటర్ అన్వర్ ఖాన్, మైనారిటీ నాయకులు జావీద్ ఖాన్, అఫ్జల్ బాబా, ఎండీ ఖాదిర్, ఎండీ పాషా, ఎండీ సలీం, అమానుల్లాహ్ ఖాన్, ఎండీ అసిఫ్, షైక్ జహిర్, రంజాన్ అలీ పాల్గొన్నారు

పెద్దవాగు ఒడ్డున వన దేవతల జాతర ప్రారంభం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మేడారం సమ్మక్క సారక్క జాతరను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పెద్దవాగు ఒడ్డున పూజారి రమేష్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరగనున్న జాతర బుధవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే కోవలక్ష్మి వనదేవతలైన సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ దేవతల చల్లని చూపు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. జిల్లా అభివృద్ధికి దేవతల ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు వివరించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసం నుంచి భాజా భజంత్రీలతో దేవతలను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వనదేవతలకు ఎమ్మెల్యే దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భర్త సోనేరావు, తనయుడు సాయినాథ్, కెరమెరి జడ్పీటీసీ దపదాబాయి, బీఆర్ఎస్ నాయకులు జీవన్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను పకడ్బందీగా అమలు చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు వి.రాములు, హరికృష్ణతో కలిసి జిల్లాలోని తహసీల్దార్లతో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లాకు సంబంధించి రాష్ట్రస్థాయి సీఎం ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రథమ ప్రాధాన్యతనిస్తూ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం దిశగా తగు చర్యలు తీసుకోవాలని, దరఖాస్తు అందిన వారం రోజులలోగా పరిష్కరించే విధంగా దృష్టి సారించాలని తెలిపారు. ధరణి పోర్టల్‌లో నమోదు అయిన భూ సంబంధిత విషయాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరపాలని, దరఖాస్తులను 3 క్యాటగిరీలుగా విభజించి త్వరితగతిన పరిష్కరించాలని, రహదారులు, ప్రాజెక్టుల నిర్మాణం ఇతర అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా చేపట్టిన భూ సేకరణకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మీ సేవ ద్వారా వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, మంచిర్యాల డివిజన్ పరిధిలో 1025, బెల్లంపల్లి పరిధిలో 205 ధ్రువపత్రాల సంబంధిత దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌కు అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాకు సంబంధించి హై కోర్టు, లోకాయుక్త, హెచ్ఆర్‌సీలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

బీఆర్ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు



- హామీల అమలుపై కాంగ్రెస్‌ను నిలదీయండి
- దేశ అభివృద్ధి కోసం మోడీ రాజ్యం రావాలి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ టౌన్

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకుంటుందని అక్కడక్కడ కొందరు అంటున్నారు.. రాష్ట్రంలో పూర్తిగా నాశనమైన ఆ పార్టీతో తాము కలిసే ప్రసక్తే లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ వ్యాఖ్యానించారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల బతుకులను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. విదేశాల నుంచి వచ్చే మద్యం కోసమే కేసీఆర్ దిల్లీకి వెళ్తున్నారని తెలిపారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఎంపీ సోయం బాపురావు, జడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్‌పై తాము పోరాటం చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మా నోటికాడ ముద్దను లాక్కొన్నదని పేర్కొన్నారు. హిందువులంతా ఓటు బ్యాంకుగా మారకపోవడంతోనే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాలేకపోయిందని పేర్కొన్నారు. హామీల అమలుపై కాంగ్రెస్‌ను నిలదీయాలని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలను గెలిపించిన ఘనత ఆదిలాబాద్ ప్రజలదని గుర్తుచేశారు. దేశంలో మోదీ రాజ్యం రావాలని అప్పుడే దేశం అభివృద్ధి చెందడంతో పాటు సుభిక్షంగా ఉంటుందని సూచించారు. దేశంలో మోదీ రాజ్యం రావాలో..రాహుల్ రాజ్యం రావాలో తేల్చుకోవాలన్నారు. రాష్ట్రంలో బీజేపీకి 17 ఎంపీ సీట్లు అప్పగిస్తే కేంద్రం నుంచి రాష్ట్రానికి అధిక నిధులు తీసుకొచ్చేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మోదీని మళ్లీ ప్రధాని చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌కు కేంద్రం నిధులు ఇవ్వడం లేదని జోగు రామన్న తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.7కోట్లతో ఈ లైన్ ఫైనల్ లోకేషన్ సర్వే పూర్తయిందని గుర్తుచేశారు. ఆదిలాబాద్‌లో పిట్‌లైన్ మంజూరు చేయించానని తెలిపారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ గల్లీలో ఎవరు ఉన్నా..దిల్లీలో మాత్రం మోదీ ఉండాలని జనం కోరుకుంటున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు స్థానాలు గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మనంద్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, యాత్ర ఇన్‌ఛార్జి పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి, నాయకులు మయూర్ చంద్ర, లాలామున్న, లోక ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు పాఠాలు నేర్పుతున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-జైపూర్

తరగతి గదులను వదిలిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు వ్యవసాయ క్షేత్రాల్లో తిరుగుతున్నారు. స్థానికంగా ఉండటమే కాకుండా రైతుల్లో ఒకరుగా పంటల సాగు అనుభవాలను తెల్సుకోవడంతో పాటు వ్యవసాయ పాఠాలు నేర్పుతున్నారు. బుధవారం స్థానిక రైతు వేదికలో సామాజిక వనరులు, గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తూలనం, ప్రెఫరెన్స్ ర్యాంకింగ్, సమస్యల చెట్టు, కాలక్రమం తదితర అంశాలపై ముగ్గులతో కూడిన చిత్రాలు వేసి గ్రామస్థులకు వివరించారు. ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల పొలాస విద్యార్థులు గత 20 రోజులుగా జైపూర్ మండల కేంద్రంలో రైతులతో కలిసి పంట క్షేత్రాలతో పాటు ఇతర అంశాలపై అధ్యయనం చేస్తున్నారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం ద్వార పొలాస వ్యవసాయ కళాశాల మూడవ సంవత్సరం విద్యార్థులు హర్షిత్, సుశాంత్, శ్రీవత్స, రాంప్రసాద్, వివేక్ తదితరులు తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠ్యాంశాల ఆధారంగా వ్యవసాయ క్షేత్రాల్లో పరిశోధనలు చేస్తున్నారు. కళాశాల విద్యార్థులు ఒక్కొక్కరు ఒక్కొక్క రైతుతో వారి అనుభవాలను తెల్సుకోవడంతో పాటు స్థానిక స్థితిగతులపై అవగాహన పెంచుకోవడం జరుగుతుందని స్థానిక వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శివకృష్ణ, సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్ట్ నాగ రాజు, తిరుపతి, ఏడీఏ రాజేశం, ఏఓ మహేందర్, ఏఈఓ కొమురయ్య రైతులు పాల్గొన్నారు.



సామాజిక వనరులతో విశ్లేషాత్మక చిత్రం

నస్పూర్‌లో ప్రారంభమైన సమ్మక్క-సారక్క జాతర

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్‌లోని ముక్కుడి పోచమ్మ గుడి దగ్గర ఉన్న సమ్మక్క సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి, రాధా కుమారి దర్శించుకుని పూజలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ జాతరను దిగ్విజయం చేయలని పుర ప్రజలను కోరారు. అలాగే జాతరలో అన్ని వసతులను ఏర్పాటు చేసిన వివిధ విభాగాల అధిపతులను జనరల్ మేనేజర్ అభినందించారు. చుట్టుపక్కల పరిసర ప్రాంతాల వారు అందరూ ముక్కిడి పోచమ్మ దగ్గర ఉన్న సమ్మక్క సారలమ్మ దేవతలను దర్శించుకోగలరని కోరారు. సమ్మక్క సారలమ్మ దివ్య ఆశీస్సులు శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న ఉద్యోగులందరిపైన పుర ప్రజలపైన ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు పాల్గొన్నారు.



అభివృదిపై ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో చర్చలు



నవతెలంగాణ-కాసిపేట

మండల అభివృద్ధిపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని ఎమ్మెల్యే నివాసంలో సుదీర్ఘ చర్చలు నిర్వహించారు. మండలంలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలు, అదికారులతో సక్రమంగా అభివృద్ధి పనులు చేసేందుకు సుదీర్ఘంగా చర్చించారు. మండల అభివృద్ధిపై ఒక రోడ్ మ్యాప్ సిద్ధం చేద్దమని, కాసిపేట మండలంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని ఎమ్మెల్యే వినోద్ వెంకట స్వామి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. త్వరలో మండలంలో పర్యటిస్తానని, అధికారులతో, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపినట్లు వివరించారు. మండలంలో కాంగ్రెస్ చాలా బలంగా ఉందని, ఇంకా కష్ట పడి ప్రజలకు చేరువ కావాలని, ప్రజలకు ఏ అవసరం వచ్చిన నేను ఉన్నానని మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ముందు ఉంటున్నాడని, చాలా కష్ట పడుతున్నాడని నిత్యం ప్రజలతో మమేకం అవుతున్న రత్నం ప్రదీప్‌ను అబినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బన్న లక్ష్మన్ దాస్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని అశోకనగర్ బ్రిడ్జి వద్ద 11కేవీ లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్న కారణంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. కాసిపేట, మామిడిగూడ, పెద్ద ధర్మారం, గోండుగూడ, పెద్దనపల్లి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

ఎంపీడీఓను సన్మానించిన బీజేపీ నాయకులు



నవతెలంగాణ-కుభీర్

మండల అధికారి శ్రీనివాస్‌ను బుధవారం బిజెపి మండల నాయకులు నాగేందర్, కనకయ్య, గంగశేఖర్ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మండలంలో అభివృద్ధి జరగలేదన్నారు. ఉపాధిహామీ కూలీలకు 100రోజులు పని కల్పించాలని కోరారు. ఎంపీడీఓ స్పందించి మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దత్తాత్రి, చిన్న సాయినాథ్, డాక్టర్ గణపతి, రోహిత్, ఉప్పు శంకర్ పాల్గొన్నారు.

బంజారా భవన్ స్థలంలో బోరుబావికి భూమిపూజ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బంజారా భవన్ స్థలంలో వేయనున్న బోరు బావికి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాలకు సమప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, నాయకులు బాధవత్ శివప్రసాద్, మల్లికార్జున్, శశి పాల్గొన్నారు.

కౌటాల తాసీల్దార్‌గా పుష్పలత

నవతెలంగాణ-కౌటాల



కౌటాల తహసీల్దార్‌గా ఇందారపు పుష్పలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పెద్దపెల్లి కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి, బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి పనులు చేసి పెడతానని ఆమె పేర్కొన్నారు.

26న మెగా జాబ్ మేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు పోలీసుల ఆధ్వర్యంలో వివిధ కంపెనీలకు సంబంధించి మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎస్పీ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఏదైనా డిగ్రీ, పీజీ పాసైన యువతీ యువకులు జాబ్ మేళాకు హాజరుకావాలన్నారు. దాదాపు 50 బహుళ జాతీయ కంపెనీలు జాబ్ మేళాలో ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు, కనీస వేతనం రూ.18000 నుంచి రూ.75 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించి పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.